క్లుప్తంగా

మహిళా సంక్షేమమే ధ్యేయం

రేగోడ్(మెదక్): మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ సభ్యుడు యాదగిరి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఇరవై మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు వరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాల్ లక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు చోటు మియా, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించండి


మాట్లాడుతున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పారిశుద్ధ్య కార్మికులకు ప్రతీ నెల 1న వేతనాలు చెల్లించాలని టీఎస్ ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రం మాసాయిపేటలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సకాలంలో జీతాలు రాక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో యువసేన రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, నాయకులు కృష్ణ, హరిప్రసాద్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

భక్తితో శివపార్వతుల కల్యాణం


శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

నర్సాపూర్: భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని శివాలయంలో మంగళవారం చేపట్టారు. ఆలయ పూజారి వీరప్పగురూజీ ఆధ్వర్యంలో చేపట్టిన శివపార్వతుల కళ్యాణ ఉత్సవంలో భక్తులు, శివ దీక్షాపరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికీ జైలు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని రహదారిపై ఎస్పీ ఆదేశాల మేరకు వారం రోజులుగా డ్రంకెన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 14 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి మంగళవారం మాట్లాడుతూ... ఇందులో భాగంగా 14 మందిలో బోయిని సంగయ్య, శంకర్‌లకు మెదక్ స్పెషల్ మొబైల్ కోర్ట్ జడ్జి కల్పన డ్రంకెన్‌డ్రైవ్ కేసులో రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మరో 12 మందికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్ఐ చెప్పారు.

నంబర్ ప్లేట్లు లేకపోతే చర్యలు: డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్: వాహనాలకు నంబర్ ప్లేట్‌లు, సరైన ధ్రువపత్రాలు లేకుండా నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. తూప్రాన్ సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 110 ద్విచక్ర వాహనాలు పట్టుబడినట్లు తెలిపారు. అలాగే హెల్మెట్‌లు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ కృష్ణ, ఎస్ఐ శివానందం పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో దంపతులు అదృశ్యం


పిల్లలతో యాదగిరి, జ్యోతి

తూప్రాన్: పిల్లలతో సహా దంపతులు అదృశ్యమైన ఘటన పట్టణ కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన బిజీలిపురం యాదగిరి భార్య జ్యోతి, కూతురు మోక్ష, కుమారుడు ధృవ ఈనెల 4వ తేదీన (సోమవారం) నిజామాబాద్ జిల్లా పెద్దగుట్టకు దర్శనం కోసం వెళ్తున్నామని ఇంటి నుంచి వెళ్లారు. మరుసటి రోజ అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి ఈ బాజా పోటీలు

నర్సాపూర్: బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో ఈనెల 6 నుంచి 11 వరకు ఈ బాజా పోటీలు కొనసాగుతాయని ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె తెలిపారు.

గృహజ్యోతి కొందరికేనా?

- కరెంట్ బిల్లులు రావడంతో ఇదేం పథకమంటూ ఆగ్రహం
- తమకేమి తెలియదంటున్న విద్యుత్ అధికారులు


తక్కువ యూనిట్లు కాల్చిన కరెంట్ బిల్లు వచ్చిందని చూపిస్తున్న అప్పాజీపల్లి లబ్ధిదారులు

అల్లాదుర్గం(మెదక్): గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మార్చి నెల జీరో బిల్లులు వస్తాయని ప్రభుత్వం ప్రకటించగా.. విద్యుత్ బిల్లులు కట్టాలని అధికారులు చెప్పడంతో ఇదేం పథకమంటూ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన గృహజ్యోతి పథకానికి అర్హులం కాదా అని ప్రశ్నిస్తున్నారు. అల్లా దుర్గం మండలంలో గృహజ్యోతి పథకం కింద 4500 లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సుమారు మూడు వేల మందికి మాత్రమే గృహజ్యోతి పథకం మంజూరైంది. మిగతా 15 వందల మందికి 200 యూనిట్లు మాత్రమే విద్యుత్ వినియోగించిన బిల్లులు రావడంతో పథకం అమలు తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులను వారు ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. మీరు దరఖాస్తు చేసినప్పుడు తప్పుడు ధ్రువపత్రాలు పెట్టి ఉంటారనే సమాధానం చెబుతున్నారు. గృహజ్యోతి పథకంపై విద్యుత్ అధికారులు సరైన అవగాహన కల్పించక పోగా, తమకు ప్రభుత్వం నుంచి సరైన నిబంధనలు రాలేవంటూ చెబుతుండటం గమనార్హం. అర్హులకు ఈ పథకం అమలు చేసేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఈ విషయంపై విద్యుత్ ఏఈ శివాజీని ప్రశ్నిస్తే ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, విద్యుత్ బిల్లు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రశీద్ మండల పరిషత్ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఎందుకు బిల్లులు వచ్చాయో తెలియదన్నారు. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో వెయ్యి మందికి బిల్లులు వచ్చినట్లు తెలిసిందన్నారు. అలాగే ఈవిషయంపై ఎంపీడీఓ శంకర్‌ను వివరణ కోరగా.. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరిది ఆన్‌లైన్ చేశామన్నారు. గృహజ్యోతి పథకం ఎందుకు అమలు కాలేదో తెలియదన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ లాగిన్ ప్రభుత్వం లాక్ చేసినట్లు తెలిపారు.

రెండు రోజులుగా తిరుగుతున్న..



ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలు చేస్తున్న మాకు కరెంట్ బిల్లు వచ్చింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న, వంద లోపు యూనిట్లు కాల్చిన బిల్లు ఇచ్చి కట్టమన్నారు. రెండు రోజులుగా కార్యాలయానికి తిరుగుతున్న.

– కురుమ సంగయ్య, అప్పాజీపల్లి

50 యూనిట్లకు కరెంట్ బిల్లు ..



ఇంటికి కరెంట్ బిల్లు రాదని చెప్పినా.. కరెంట్ బిల్లు ఇస్తున్నారు. 50 యూనిట్ల లోపు కరెంట్ కాల్చిన బిల్లు వస్తోంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న పథకం అమలు కావడం లేదు. మాకు చదువు రాదు, ఎవరు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి మాకు సాయం చేయాలి.

– రాజమల్లయ్య, అప్పాజీపల్లి

తాగునీటి సరఫరాకు చర్యలు

- పట్టణ అభివృద్ధిపై సమీక్ష


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: పట్టణంలో అవసరమైన చోట వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని, తాగునీరు సజావుగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిపై మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్ష చేపట్టారు. మున్సిపాలిటీలో ని వార్డు అధికారులు ఇటీవల పట్టణంలో వార్డుల వారీగా పర్యటించి సేకరించిన సమస్యలపై చర్చించారు. ఆయా వార్డుల్లో వీధి దీపాలు, మురికి కాల్వలు, సీసీ రోడ్ల అవసరాలను వార్డు అధికారులు గుర్తించి చైర్మన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. అవసరమైన చోట మొదటగా వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో తాగు నీరు సజావుగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, మిగిలిన పనులు క్రమంగా చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. సమావేశంలో మున్సిపాలిటీ మేనేజర్ మధుసూదన్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో పంటల దిగుబడి


మొక్కజొన్న పంటల సస్యరక్షణ చార్టులు ప్రదర్శిస్తున్న రవిశంకర్

చేగుంట(తూప్రాన్): మొక్కజొన్న పంటలకు చేపట్టే సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి సాధించవచ్చునని కేంద్రీయ సస్యరక్షణ సహాయ అధికారి రవి శంకర్ అన్నారు. మండలంలోని మక్కరాజీపేటలో మంగళవారం జీడిమెట్ల కేంద్రీయ సస్యరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో మొక్కజొన్న పంటలపై క్షేత్ర పాఠశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటలకు వివిధ దశల్లో పంటలకు అందించే రసాయన ఎరువుల వాడకం తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. జాగ్రతలకు సంబంధించిన ఫ్లో చార్టులను ప్రదర్శించి వాటిని మొక్కజొన్న రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

గృహజ్యోతి జీరో బిల్లుల పంపిణీ


మహ్మద్‌నగర్‌లో జీరో బిల్లులు పంపిణీ చేస్తున్న నేతలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహ్మద్‌నగర్‌లో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు గృహజ్యోతి జీరో బిల్లులు పంపిణీ చేశారు. లైన్‌మెన్ మల్లాగౌడ్‌తో పాటు కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రఘు ఆధ్వర్యంలో గ్రామంలో లబ్ధిదారులకు జీరో బిల్లులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పక్కగా అమలు చేస్తుందని చెప్పారు. గృహజ్యోతితో ప్రజలకు విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలగౌడ్, దుర్గయ్య, కృష్ణ, నర్సింలు, గణేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలి

శివంపేట(నర్సాపూర్): ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని హోలియదాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి యాదగిరి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో డా.బీఆర్ అంబేడ్కర్ కోరుకున్న రిజర్వేషన్లు 59 శాతం ఎస్సీ ఉపకులాలకు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోని అన్ని రంగాల్లో రిజర్వేషన్లు 15 శాతం నుంచి 22 శాతం వరకు పెంచాలని అన్నారు.

పట్టా పాస్‌బుక్‌లు అందజేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని చెట్ల తిమ్మాయిపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 158లో పొజిషన్‌లో ఉన్న రైతులకు సర్వే చేసి నూతన పట్టా పాస్‌బుక్‌లు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఐలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ జ్ఞానజ్యోతికి రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూ ప్రక్షాళన పేరుతో రైతుల పొట్ట కొట్టేందుకు పాసుబుక్‌లను పంపిణీ చేయకుండా నిలిపిందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి అర్హులైన రైతులందరికీ పాస్‌బుక్‌లు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోచయ్య, నాగమణి, యాదమ్మ, కిషన్, లింగయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఊరేగింపు


బోనాల ఊరేగింపు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్నఘనపూర్ శివారు వనదుర్గా ప్రాజెక్టు ఎగువ భాగంలోని దుర్గామాత ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాల ఊరేగించి సమర్పించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు అమ్మవారికి మొక్కులను చెల్లించుకున్నారు.

పెచ్చులూడిన ఎంపీడీఓ కార్యాలయ భవనం


కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయం భవనం పెచ్చులూడి పడిన పైకప్పు


శిథిలావస్థలో కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరింది. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం భవనం పైకప్పు పెచ్చులూడి కిందపడింది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అధికారులు ఆందోళన చెందుతున్నారు. కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద పెకప్పు పెచ్చులూడి కింద పడింది. ఆ సమయంలో ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. గత వర్షాకాలంలో అధికారులు వేరేగదుల్లోకి మారారు. ప్రస్తుతం మరోచోట పెచ్చులూడటంతో భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం


ఉపాధ్యాయులతో విద్యార్థులు

టేక్మాల్(మెదక్): మండలంలోని వేల్పుగొండ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. హెచ్ఎంగా నర్సింలు, ఉపాధ్యాయులుగా నాగరాజు, భాస్కర్, పవిత్ర, గాయత్రి, శైలజ, నిరంజన్, పాల్సన్ రాజ్, ఓంప్రకాష్, భాను ప్రసాద్, పీఈటీగా సాయి తేజ, అటెండర్‌గా ప్రదీప్ వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయులు ఎల్లమ్మ, మల్లప్ప, నాగరాణి, మాధవి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణ అంగన్‌వాడీ టీచర్ సంగమణి, గ్రామస్తులు సాయిలు, నర్సింలు, రాములు పాల్గొన్నారు.

నేడు ఆధునిక, సాంకేతిక విధానాలపై అవగాహన

కొల్చారం(నర్సాపూర్): మండలంలో ఎంపిక చేయబడ్డ పోతంశెట్టిపల్లి రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభం కానుంది. దృశ్య, శ్రవణం ద్వారా రైతులకు ఆధునిక, సాంకేతిక విధానాలపై అవగాహన కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఈ వీడియో కాన్ఫరెన్స్‌ను ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నట్లు ఏఓ శ్వేత కుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధికారి, తహసీల్దార్, హార్టికల్చర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ, ప్రాథమిక సహకార సంఘం సీఈవోలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ముగిసిన మల్లికార్జునస్వామి ఉత్సవాలు


శివ్వంపేట(నర్సాపూర్): నాయకులను సన్మానిస్తున్న నిర్వాహకులు


వెల్దుర్తి(తూప్రాన్): స్వామివారిని దర్శించుకుంటున్న రాజిరెడ్డి, తదితరులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామంలో మల్లికార్జునస్వామి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. అందులో భాగంగా మంగళవారం రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి బండ్లు, బోనాలు ఊరేగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, నవీన్‌గుప్తా, వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, బోళ్ళ ఆంజనేయులు, నర్సారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాంచందర్‌గౌడ్, భిక్షపతి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు వారిని సన్మానించారు.


శివ్వంపేట(నర్సాపూర్): బోనాలతో మహిళలు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని శేరీల గ్రామంలో మల్లన్న జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎల్లమ్మ కల్యాణం నిర్వహించారు. అనంతరం బోనాలు ఊరేగించారు. ఉత్సవాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, మల్లేశం, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లిలో వంద శాతం పల్స్ పోలియో


పీర్యతండాలో పిల్లలకు చుక్కల మందు వేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


కౌడిపల్లి(నర్సాపూర్): తునికిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): పిల్లలకు వందశాతం పోలియో చుక్కలు వేశామని మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మూడు రోజులుగా ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వైద్యసిబ్బంది అంగన్‌వాడీ టీచర్లు పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆదివారం గ్రామాల్లో బూత్‌ల వద్ద 5ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశామన్నారు. ఆరోజు వివిధ కారణాలతో చుక్కల మందు వేసుకొని పిల్లలకు సోమవారం, మంగళవారం ఇంటింటికీ తిరిగి చుక్కల మందు వేశామన్నారు. దీంతో పాటు బస్టాండ్‌వద్ద ప్రయాణికులకు సైతం చుక్కల మందు చేశామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఏడుగురు దొంగలు రిమాండ్

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్, రామాయంపేట మండలాలతో పాటు వివిధ జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని తాడేపు మహేందర్ సెంట్రింగ్ డబ్బాలు ఎత్తుకెళ్లిన ఏడుగురు దొంగలను అరెస్ట్ చేసి, సాయంత్రం మెదక్ కోర్టులో హాజరుపర్చామన్నారు. నల్గొండ జిల్లా బుద్ధగోని తండాకు చెందిన నేనావత్ చందర్, ముదావత్ కమల, ముదావత్ మనీషా, మెగావత్ చంద్రకళ, ఇస్లావత్ రోజా, సున్నావత్ జ్యోతి, దేవరకొండ మనీషాను రిమాండ్ చేశామన్నారు. ఈ దొంగలు అంతరాష్ట్ర దొంగతనాలకు పాల్పడి తప్పించుకొని తిరుగుతుండగా మండల కేంద్రంలో దొంగతనానికి పాల్పడటంతో దొంగలను గుర్తించినట్లు వివరించారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): ఫిట్స్‌తో కిందపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటలోని శేరింజాబీ దాబాలో శంకర్ సోలంకీ (42) పదిహేళ్లుగా పని చేస్తున్నాడు. అతడికి కుటుంబ సభ్యులు ఎవరు లేరు. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం అతను ఫిట్స్‌తో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

◆ సరైన పత్రాలు లేని 10 వాహనాలు స్వాధీనం

హవేళిఘణాపూర్(మెదక్): సరైన పత్రాలు లేని పది వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు మెదక్‌రూరల్ ఎస్ఐ అమర్ తెలిపారు. మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మెదక్ – రామాయంపేట రోడ్డుపై సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి, వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

◆ రైల్వే అండర్ పాస్ నిర్మాణం వద్ద ప్రమాదం : నలుగురికి గాయాలు

మనోహరాబాద్(తూప్రాన్): రైల్వే అండర్ పాస్ నిర్మాణ పనుల్లో కట్టిన బీమ్ వాల్, స్లాబ్ సెంట్రింగ్ కూలి నలుగురికి గాయాలైన సంఘటన మండలం కూచారం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కూచారం రైల్వే స్టేషన్ గేట్ వద్ద ప్రధాన మంత్రి శంకుస్థాపన చేసిన 420 గేట్ వద్ద చేపట్టిన అండర్ పాస్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పనులు చేస్తుండగా ఒక్కసారిగా స్లాబ్ కూలడంతో అక్కడ పని చేస్తున్న పలువురు కార్మికులకు గాయాలయ్యాయి. వీరిలో కృష్ణ, రవీందర్, బాబురావు, అనిల్ ఉన్నారు. వీరిని చికిత్స నిమిత్తం మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వేరే ఆస్పత్రికి తరలించినట్లు కార్మికులు తెలిపారు.

◆ మున్సిపల్ అవిశ్వాసం ఏర్పాట్ల పరిశీలన

తూప్రాన్: మున్సిపల్ చైర్మన్‌పై నేడు జరుగనున్న అవిశ్వాసం ఏర్పాట్లను ఆర్డీఓ జయచంద్రరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని 16 మంది కౌన్సిలర్లకు అవిశ్వాసం బుధవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవిశ్వాసం నెగ్గితే ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపిస్తామన్నారు. సమావేశంలో సీఐ కృష్ణ, ఎస్ఐ శివానందం, కమిషనర్ ఖాజా మోయిజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

◆ పీఆర్‌సీ అమలు చేయాలి

కౌడిపల్లి(నర్సాపూర్): రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 51శాతం ఫీట్‌మెంట్‌తో పీఆర్‌సీని అమలు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఓంప్రకాష్ డిమాండ్ చేశారు. మంగళవారం కౌడిపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్ఏ, ఎస్‌జీటీల్లో వేతన వ్యత్యాసం తగ్గించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీఏ బకాయిలు 90శాతం నగదు ఏక కాలంలో అమలు చేయాలని చెప్పారు. మహిళ ఉద్యోగులకు చైల్డ్ కేర్ సెలవులు 90 రోజుల నుంచి 160 రోజులకు పెంచాలన్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

చేగుంట(తూప్రాన్): బీఆర్ఎస్ నాయకులు ఎంపీపీ మాసుల శ్రీనివాస్‌తో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.